ప్రజాశక్తి
శుక్రవారం 6 జనవరి 2023
5
శ్రీకాకుళం

బ్రెయిలీ కేలండర్ ఆవిష్కరణ

శ్రీకాకుళం అర్బన్ : వికలాంగుల శాఖ ఇ-ప్రోగ్రాం ద్వారా తయారు చేయించిన బ్రెయిలీ కేలండర్‌ను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగవైకల్యం ఉందని దిగులు చెందకుండా ప్రతి వికలాంగుడు తనలో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయాలన్నారు. లూయిస్ బ్రెయిలీ కంటి చూపును కోల్పోయిన తర్వాత అధైర్యపడకుండా పట్టుదలతో చదవుకోవాలన్న తలంపుతో ఎన్నో అవమానాలు, కష్టాలు ఎదుర్కొని చివరకు తాను చదువుకున్న పాఠశాలలో ఉపాధ్యాయుడుగా చేరారని చెప్పారు. ఆయన కనుగొన్న లిపి ఆధారంగా తయారు చేసిన కేలండర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ డి.వి విద్యాసాగర్, వికలాంగుల శాఖ ఎడి ఎం.కిరణ్ కుమార్, అంధ ఉద్యోగుల సంఘం సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అప్పలరాజుకు గడ్డు రోజులు

- నియోజకవర్గంలో జోరందుకున్న అసమ్మతి కార్యకలాపాలు
- పలాస టిక్కెట్‌కు సైతం నాయకుల దరఖాస్తు
- అసమ్మతి గ్రూపుతో ఫలించని రాజీ ప్రయత్నాలు
- 'గడప గడపకు'లోనూ మంత్రి వెనుకబాటు

పలాస నియోజకవర్గం టిడిపికి కంచుకోట. అటువంటి స్థానంలో సీదిరి అప్పలరాజు భారీ మెజార్టీతో గెలిచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనూహ్యంగా వైసిపి ప్రభుత్వంలో తొలిసారి మంత్రి పదవిని చేపట్టి అందరి దృష్టినీ ఆకర్షించారు. మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ తర్వాత కూడా కేబినెట్‌లో చోటు దక్కించుకున్నారు. అటువంటి ఆయన ప్రస్తుతం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. తన వ్యవహారశైలితో విజయంలో కీలకపాత్ర పోషించిన నియోజకవర్గ ముఖ్య నాయకులను ఒక్కొక్కరినీ దూరం చేసుకుంటున్నారు. మరోవైపు ముఖ్యమంత్రి జగన్ వద్ద క్రమేణా ఆయన పలుకుబడి తగ్గుతోంది. గడప గడపకూ మన ప్రభుత్వంలో బాగా వెనుబడిన ఎమ్మెల్యేల జాబితాలో ఆయన ఉన్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పలాస

పలాస నియోజకవర్గంలో మంత్రి అప్పలరాజుకు వ్యతిరేకంగా అసమ్మతి నాయకులు తమ కార్యకలాపాలను తీవ్రతరం చేస్తున్నారు. ఆగస్టు 28న పలాస మండలం కంబిరిగాం తోటలో మంత్రి అప్పలరాజుకు వ్యతిరేకంగా సమావేశమయ్యారు.

సెప్టెంబర్ 7న వజ్రపుకొత్తూరు మండలం శారదాపురంలో, నవంబరు 27న మందస మండలం దున్నూరులో 300 మందితో సమావేశం నిర్వహించారు. ఈ నెలాఖరులో పలాస పట్టణంలో భారీ జన సమీకరణతో సమావేశం నిర్వహించాలని అసమ్మతి నాయకులు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. మంత్రి అప్పలరాజు వ్యవహారశైలి, అవినీతి ఆరోపణలపై జిల్లాకు చెందిన పార్టీ పెద్దలతో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. పార్టీలో కష్టపడి పనిచేసిన సీనియర్లకు విలువ ఇవ్వడం లేదని, వచ్చే ఎన్నికల్లో ఆయనకు టిక్కెట్ ఇస్తే ఓడిస్తామని బహిరంగంగానే చెప్తున్నారు.

మంత్రికి చెక్ పెట్టేందుకు వ్యూహాలు

మంత్రి అప్పలరాజుపై తిరుగుబావుటా ఎగురవేసిన సీనియర్ నాయకులు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ మంత్రికి వ్యతిరేకంగా మద్దతును కూడగడుతున్నారు. నియోజకవర్గంలో కేడర్ అంతా మంత్రిని వ్యతిరేకిస్తున్నారన్న సంకేతాలను అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. అధిష్టానం మంత్రికి టిక్కెట్ నిరాకరిస్తే, తామూ పోటీ చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు తెలియజేసేందుకు టిక్కెట్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. మాజీ ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు సోదరుడు జుత్తు నీలకంఠం, పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ అసమ్మతి గ్రూపు తరుపున దరఖాస్తు చేయగా, హైదరాబాద్‌లో ఉంటున్న మందస మండలానికి చెందిన వైద్యులు దున్న శాంతారావు కూడా దరఖాస్తు చేసినట్లు సమాచారం.

స్వయంకృతాపరాధమేనా?

పలాస నియోజకవర్గంలో నానాటికీ అసమ్మతి పెరగడం, కార్యకలాపాలు జోరందుకోవడానికి మంత్రి అప్పలరాజు స్వయంకృతాపరాధమే కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల నుంచి ప్రారంభమైన అసమ్మతి ఇప్పుడు పతాక స్థాయికి చేరింది. ఎన్నికల్లో రెబల్ అభ్యర్థులను నచ్చజెప్పి పోటీ నుంచి ఉపసంహరించకుండా వారిని ప్రోత్సహించారన్న విమర్శలు ఉన్నాయి. దీంతో ఓటమిపాలైన వారిలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. వైసిపిని రెండు గ్రూపులుగా వీడదీసి విభజించు, పాలించు తరహాలో నెరిపిన రాజకీయాలు మంత్రికే చేటు తెచ్చాయనే చర్చ నియోజకవర్గంలో సాగుతోంది. దీంతోపాటు ఏకపక్ష నిర్ణయాలు, తనకు గిట్టని వారిని అణచివేయాలన్న వైఖరి, పార్టీలో తగినంత ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో సీనియర్లు మంత్రికి దూరమయ్యారు. వారిలో కొందరు తిరుగుబాటు చేయగా, మరికొందరు స్తబ్దుగా ఉండిపోయారు. మున్సిపల్ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, పిఏసిఎస్ మాజీ చైర్మన్ దువ్వాడ హేంబాబు చౌదరి మంత్రికి వ్యతిరేకంగా అసమ్మతి గళం విపారు. పలాస మాజీ జెడ్‌పిటిసి వరిశ హరిప్రసాద్, మందస మాజీ ఎంపిపి ప్రతినిధి కొర్ల కన్నారావు గతంలో పార్టీలో చురుకైన పాత్ర పోషించగా, తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో ప్రస్తుతం పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నారు.

టిడిపికి అనుకూలంగా పరిణామాలు

పార్టీలో నెలకొన్న పరిణామాలతో ఒక అంచనాకు వచ్చిన మంత్రి అప్పలరాజు అసమ్మతి నాయకులతో రాజీ ప్రయత్నాలు సాగించేందుకు ప్రయత్నించినా, వారు ససేమిరా అన్నట్లు తెలుస్తోంది. మంత్రి అప్పలరాజుతో తాడోపేడో తేల్చుకునేందుకే సిద్ధమైనట్లు సమాచారం. వైసిపిలో కుమ్ములాటలు, గ్రూపుల పోరు క్రమేణా టిడిపికి అనుకూలంగా మారుతున్నాయన్న చర్చ నియోజకవర్గంలో సాగుతోంది.

జిల్లా ఓటర్లు 18,26,018

తుది ఓటర్ల జాబితా విడుదల

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా తుది ఓటర్ల జాబితా-2023ను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ గురువారం విడుదల చేశారు. సమర్థవంతంగా ఓటర్ల జాబితాను తయారు చేసిన అధికారులను ఆయన అభినందించారు. జిల్లాల పునర్విభజన అనంతరం జిల్లాలోని ఎనిమిది శాసనసభ నియోజకవర్గాల తుది ఎన్నికల జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసిందని చెప్పారు. జిల్లావ్యాప్తంగా 18,26,018 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఇందులో 9,09,559 మంది పురుష ఓటర్లు, 916257 మంది మహిళా ఓట్లర్లు, 202 మంది ఇతరులు ఉన్నట్లు వివరించారు. జిల్లాలో 2,342 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. 18 ఏళ్లు నిండిన వారు ఆన్‌లైన్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకునేందుకు వీలుందన్నారు. www.ceoandhra.nic.in లేదా nvsp పోర్టల్ ద్వారా అర్హులైన వారు ఓటరుగా తమ పేరు నమోదు చేసుకోవచ్చని సూచించారు. 2023లో 18-19 వయసు గల యువత 16,003 మంది ఎలక్టోరల్స్‌గా నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు
ఇచ్ఛాపురం	295	1,27,127	1,32,564	21
పలాస	278	1,03,350	1,06,785	42
టెక్కలి	316	1,17,860	1,16,728	18
పాతపట్నం	316	1,12,588	1,12,060	17
శ్రీకాకుళం	279	1,30,814	1,32,181	39
ఆమదాలవలస	259	94,246	95,038	23
ఎచ్చెర్ల	309	1,20,467	1,17,507	25
నరసన్నపేట	290	1,03,107	1,03,394	17
మొత్తం	**2,342**	**9,09,559**	**9,16,257**	**202**

నష్టపోతున్నాం... న్యాయం చేయండి

ఏకసభ్య కమిషన్‌కు బెంతు ఒరియాల వినతి

ప్రజాశక్తి - కంచిలి / పలాస

వినతిపత్రం అందజేస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ

కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు కాకపోవడంతో అన్నివిధాలుగా నష్టపోతున్నామని, తమను ఎస్‌టి జాబితాలో చేర్చి న్యాయం చేయాలని బెంతు ఒరియాలు ఏకసభ్య కమిషన్ సభ్యుడు ఐ.శామ్యూల్ ఆనంద్ కుమార్‌ను కోరారు. బెంతూ ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని వచ్చిన వినతులపై అధ్యయనానికి వచ్చిన ఏకసభ్య కమిషన్ సభ్యుడు శామ్యూల్ గురువారం కంచిలి మండలంలోని కొక్కిలిపుట్టుగ, కొన్నాయిపుట్టుగలో పర్యటించి వారి స్థితిగతులను తెలుసుకున్నారు. ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయకపోవడంతో తమ బిడ్డల భవిష్యత్ నాశనమవుతోందని బెంతు ఒరియా సంఘ నాయకులు డాక్టర్ జగబందు దొలాయి, రజనీకాంత్ తదితరులు ఆయన ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తమకు ఎస్‌టి ధ్రువపత్రాలను మంజూరు చేశారని, తర్వాత నిలుపుదల చేశారని చెప్పారు. జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యే బెందాళం అశోక్ కమిషన్ సభ్యునికి బెంతు ఒరియాలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. కుల ధ్రువీకరణ పత్రాల మంజూరులో న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ హైమావతి, పలువురు అధికారులు, బెంతు ఒరియా సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

వారిని ఎస్‌టి జాబితాల్లో చేర్చొద్దు

ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న బెంతు ఒరియా ప్రజలతో, మైదాన ప్రాంతంలోని బెంతు ఒరియాలకు ఎలాంటి సంబంధాలు లేవని వారిని గిరిజనులుగా పరిగణించవద్దని గిరిజన జెఎసి జిల్లా అధ్యక్షులు సవర రాంబాబు, ఆలిండియా ఆదివాసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సవర జగన్నాయకులు కోరారు. పలాస మండలం రామకృష్ణాపురంలోని అతిథిగృహంలో ఏకసభ్య కమిషన్ సభ్యుడు శామ్యూల్‌ను కలిశారు. జిల్లాలో ఉన్న బెంతు ఒరియా నకిలీలు అని, వీరు బిసి-ఎ అనడానికి ఆధారాలు ఉన్నాయని వివరించారు. 1961 జనాభా లెక్కల ప్రకారం గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణా సంస్థ సేకరించిన వివరాలను ఏకసభ్య కమిషన్ ముందుంచారు. నకిలీ బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చి ఆదివాసీలకు అన్యాయం చేయొద్దని కోరారు. ఏకసభ్య కమిషన్‌ను కలిసిన వారిలో జెఎసి నాయకులు సవర జగన్నాయకులు, ఎస్.రాంబాబు తదితరులున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

నాటుసారా నిర్మూలనకు చర్యలు

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో నాటుసారా తయారీ, రవాణాను పూర్తిస్థాయిలో నిర్మూలనకు చర్యలు చేపట్టాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులను ఆదేశించారు. సరిహద్దు ప్రాంతాల నుంచి రవాణా అవుతున్న మద్యానికి అడ్డుకట్ట వేయాలని దిశానిర్దేశం చేశారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో గురువారం నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాటుసారా, మద్యం రవాణా కేంద్రాలపై సమాచారాన్ని సేకరించి ప్రణాళికాబద్ధంగా, వ్యూహాత్మకంగా దాడులు చేసి అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు. నాణ్యమైన పనితీరుతో సాధ్యమైనంత మేరకు ఎక్కువ మొత్తంలో ఇతర రాష్ట్రాల నుంచి రవాణా అవుతున్న నాటుసారా, మద్యంపై నిఘా పెట్టి పట్టుకోవాలన్నారు. నాటుసారా తయారీ, ఉత్పత్తి, విక్రయ కేంద్రాలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో పరివర్తన కార్యక్రమాలు చేపట్టి గిరిజనుల్లో నాటుసారా వల్ల కలిగే నష్టాల గురించి వివరించాలని తెలిపారు. విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టి మద్యం అక్రమ రవాణాను నియంత్రించాలని ఆదేశించారు. మాదకద్రవ్యాలు వాడడం వల్ల కలిగే దుష్ప్రభావాలపై కళాశాల విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించాలనిన్నారు. అనంతరం పలు కేసుల్లో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ఎస్ఇబి జాయింట్ డైరెక్టర్ వి.నాగమణికంఠ ప్రశంసాపత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు. సమావేశంలో ఎస్ఇబి అసిస్టెంట్ కమిషనర్ కె.పి గోపాల్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజీ ద్వారా క్రిమినల్ కేసుల పరిష్కారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసుల పరిష్కారానికి పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. నగరంలోని జిల్లా కోర్టులో పోలీసులు, న్యాయాధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ఎక్సైజ్, విద్యుత్ శాఖ అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వచ్చే నెల 11న నిర్వహించే లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో క్రిమినల్ కేసులు పరిష్కారం కావడం వల్ల కక్షిదారులకు సమయంతో పాటు డబ్బు వృథా కాదన్నారు.

ప్రజల మధ్య సామరస్య, స్నేహపూర్వక సంబంధాలు పెరిగి శాంతిభద్రతల పరిరక్షణకు దోహదపడతాయన్నారు. సమావేశంలో అదనపు జిల్లా జడ్జి తిరుమల వెంకటేశ్వర్లు, సీనియర్ సివిల్ జడ్జిలు నాగమణి, అనూరాధ, జూనియర్ సివిల్ జడ్జిలు భరణి రాణి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.ఫల్గుణరావు, అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ గోపాల్, ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, డిఎస్‌పి మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పథకాల అమలు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్పీకర్ సీతారాం

బూర్జ : రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ పారదర్శకంగా పథకాలను అమలు చేస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండల కేంద్రంలో 170 మంది నూతన లబ్ధిదారులకు గురువారం పింఛన్లు మంజూరు చేశారు. సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన అనంతరం పెన్షన్ కానుక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పెన్షన్ల కోసం వృద్ధులు, వికలాంగులు గంటల కొద్దీ వరుసక్రమంలో నిలబడే వారన్నారు. అర్హత ఉండి కొత్త పెన్షన్ రావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి ఉండేదని చెప్పారు. వైసిపి ప్రభుత్వంలో అర్హత ఉంటే అర్హతా పత్రాలను గ్రామ సచివాలయంలో అందజేస్తే 21 రోజుల్లోపు పెన్షన్ కార్డు మంజూరవుతుందని తెలిపారు. పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపడుతున్నట్లు చెప్పారు. ఏ నాయకులను ప్రసన్నం చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కర్నేన దీప, జెడ్‌పిటిసి బి.రామారావు, వైస్ ఎంపిపిలు బి.సూర్యారావు, కె.కృష్ణంనాయుడు, ఎంపిడిఒ రవీంద్ర, వైసిపి మండల అధ్యక్షులు కె.గోవిందరావు, డిసిఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు గుమ్మడి రాంబాబు, సర్పంచ్ ఎ.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నూతన రైల్వే టిక్కెట్ కౌంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - ఆమదాలవలస

శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల కోసం నూతన టిక్కెట్ కౌంటర్‌ను స్టేషన్ మాస్టర్ మొదలవలస రవి, చీఫ్ టిక్కెట్ బుకింగ్ సూపర్‌వైజర్ శివశంకర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా సమయంలో రైల్వేస్టేషన్‌కు ఇవతల వైపు ఉన్న ప్రత్యేక టిక్కెట్ కౌంటర్‌ను మూసివేసినట్లు తెలిపారు. నూతన ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కావడంతో ఇక్కడ ఉన్న ఆటోమేటిక్ టిక్కెట్ వెండింగ్ మిషన్‌ను తొలగించనున్నట్లు చెప్పారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన తర్వాత ఇటీవల ఏర్పాటు చేసిన ఎటివిఎంను ప్రారంభించారు. దీంతో రైల్వేస్టేషన్‌కు ఇవతల వైపు నుంచి వచ్చే ప్రయాణికులకు టిక్కెట్‌ను తీసుకునేందుకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎన్‌టి జెఇ నూకరాజు, నారాయణరావు, రైల్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

మండలంలోని నైర వ్యవసాయ కళాశాలలో రహదారి భద్రతపై గురువారం అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ సిహెచ్.శ్రీదేవి మాట్లాడుతూ రహదారి భద్రతా నియమాలు, నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. సదస్సులో కళాశాల అసోసియేట్ డీన్ డి.శ్రీనివాస్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీధర్, ఆర్అండ్‌బి డిఇలు కె.జాన్ వైక్లిఫ్, ఆర్.గణపతిరావు, పంచాయతీరాజ్ డిఇ ఎం.పోలినాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిటిసి శ్రీదేవి

ఉత్సాహంగా ఆటల పోటీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం ప్రాంతీయ స్థాయి అంతర్ పాలిటెక్నిక్ క్రీడా పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళం సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన పోటీలను ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గురువారం ప్రారంభించారు. జిల్లాలోని మొత్తం పది కళాశాలల నుంచి 441 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో 264 మంది పురుష క్రీడాకారులు, 171 మంది మహిళా క్రీడాకారులు పాల్గొన్నారు. మొత్తం ఆరు గేమ్‌లు, 13 స్పోర్ట్స్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం సాంకేతిక విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సాంకేతిక విద్య అభ్యసించిన వారికి ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. క్రీడల్లో రాణిస్తున్న వారికి సమాజంలో మంచి గుర్తింపు కూడా వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో రణస్థలం జెడ్‌పిటిసి టొంపల సీతారాం, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ గురుగుబెల్లి దామోదరరావు, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి, ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎ.గోపి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌ఛార్జి పీడీ జి.శివప్రసాద్, పలు ప్రభుత్వ, ప్రయివేటు పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్‌లు, కళాశాల సిబ్బంది, ఎంపిటిసిల సంఘం రణస్థలం మండల అధ్యక్షులు మహంతి చిన్నరామునాయుడు, నాయకులు వెంకన్నగారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చీకటి జిఒపై న్యాయ పోరాటం

- ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు
- జిఒ నంబరు 1కు వ్యతిరేకంగా టిడిపి నిరసనలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం యంత్రాంగం

రోడ్లపై ర్యాలీలు, సభలపై నిషేధం విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ నంబరు 1పై అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. జిఒ నంబరు 1ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ టిడిపి ఆధ్వర్యాన జిల్లాలోని పలుచోట్ల గురువారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం నగరంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ లోకేష్ యువగళం పాదయాత్రను, చంద్రబాబు సభలను అడ్డుకోవడానికే ప్రభుత్వం చీకటి జిఒను తీసుకొచ్చిందన్నారు. టిడిపికి లభిస్తున్న జనాదరణను ఓర్వలేని వైసిపి ప్రభుత్వం, ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిచ్చి నియంతృత్వ పోకడలను అవలంభిస్తోందని ధ్వజమెత్తారు. ఇలాంటి జిఒలే తీసుకొస్తే ప్రతిపక్ష నేతగా జగన్ పాదయాత్ర చేసే వారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, దానికి చరమగీతం పాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

కవిటి : జిఒ ప్రతులను దహనం చేస్తున్న ఎమ్మెల్యే అశోక్ తదితరులు

కవిటిలో ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే బెందాళం అశోక్ క్యాంపు కార్యాలయం నుంచి కవిటి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం మానవహారం నిర్వహించి జిఒ నంబరు 1 ప్రతులను దహనం చేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర్య కాంక్షను అణచివేసేందుకు బ్రిటిష్ పాలకులు అనుసరించిన పద్ధతినే నేటి వైసిపి ప్రభుత్వం అనుసరిస్తోందని విమర్శించారు.

పలాస : అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న గౌతు శిరీష

కార్యక్రమంలో టిడిపి నాయకులు మణిచంద్ర ప్రకాష్ రెడ్డి, సీపాన వెంకటరమణ, బెందాళం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పలాసలో టిడిపి కార్యాలయం నుంచి కాశీబుగ్గ అంబేద్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. జిఒ నంబరు 1 ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం బ్రిటిష్ కాలం నాటి చట్టాలను తెచ్చి రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితిని తీసుకొస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలసలో టిడిపి కార్యాలయం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించిన అనంతరం మానవహారం నిర్వహించారు. జిఒ 1ను దగ్ధం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మొదలవలస రమేష్, సనపల ఢిల్లేశ్వరరావు, నూకరాజు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షులు మెట్ట సుజాత తదితరులు పాల్గొన్నారు.

బూర్జ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లంక జగన్మోహనరావు, పోలినాయుడు, గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలిలో అంబేద్కర్ జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మానవహారం నిర్వహించి జిఒ ప్రతులను దగ్ధం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి, ఎస్‌సి సెల్ విభాగం జిల్లా అధ్యక్షులు మట్ట పురుషోత్తం, తెలుగు యువత రాష్ట్ర నాయకులు రెయ్యి ప్రీతీష్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

పొందూరులో అంబేద్కర్ జంక్షన్‌లో కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రామ్మోహన్, పట్టణ అధ్యక్షులు ఎ.రంగా, మండల ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

పొందూరు : కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

మహారాజశ్రీ విజయనగరం మోటారు యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ మరియు 1వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టులో

ఎం.వి.ఓ.పి.నెం.293/2022

బిట్వీన్ :
మిత్తాన పార్వతి మరియు వగైరా......పిటిషనర్లు
మరియు
గాలి శ్రీనివాసరావు వగైరాలు......రెస్పాండెంట్లు
2వ రెస్పాండెంటు వివరం:
పేడాడ చంద్రశేఖర ఆజాద్, తండ్రి పరమేశ్వర రావు,
డోర్ నెంబరు 1-24, బాందివిపురం.
బ్యాంకర్స్ కోలనీ, శ్రీకాకుళం.

నోటీసు

పై నెంబరు కేసులో పిటిషనర్లు రెస్పాండెంట్లపై వాళ్లకు రావలసిన నష్టపరిహారం ఇప్పించవలసినదిగా పెట్టిన కేసులో రెండవ రెస్పాండెంటు నోటీసు అమలు జరగనందున ఈ పత్రికా ప్రకటన ద్వారా రెండవ రెస్పాండెంటు కేసు వాయిదా నిమిత్తం కోర్టు వారి ఆదేశాల మేరకు ఈ ప్రకటన చేయబడినది. సదరు కేసు 27.01.2023 వాయిదా అయి ఉన్నది. కావున 2వ రెస్పాండెంటు అయిన పేడాడ చంద్రశేఖర ఆజాద్ స్వయముగా గాని, వారి తరపు న్యాయవాది ద్వారా గాని 27.01.2023 ఉదయం 10.30 ని॥లకు పైన తెల్పిన కోర్టులో తమ వాదనను తెలియజేయవలసి ఉన్నది. లేని యెడల కోర్టువారు 2వ రెస్పాండెంటు పరోక్షముగా సదరు కోర్టు వారు నిర్ణయం తీసుకొనబడును.

పి.జనార్ధనరావు
అడ్వకేట్ ఫర్ పిటిషనర్స్
విజయనగరం

విజయనగరం.
తేది.04.01.2023

క్రీడల్లో ప్రతిభతో గుర్తింపు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

యువత క్రీడలతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఎంపి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. అనకాపల్లి జిల్లా చోడవరంలో నిర్వహించిన అండర్-18 ఎస్‌జిఎఫ్ పోటీల్లో బాలికల జట్టు తూర్పుగోదావరిపై విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. గుంటూరును ఓడించి సెమీస్‌లో తూర్పుగోదావరిపై ఫైనల్లో సాధించి తుది పోరులో విశాఖపట్నం జిల్లాపై 35-30 పాయింట్ల తేడాతో రన్నర్లుగా నిలిచారు. బాలుర జట్టు కృష్ణా, కడప విజయం సాధించి, సెమీస్‌లో తూర్పుగోదావరి జట్టు చేతిలో పరాజయం పొంది తృతీయ స్థానం దక్కించుకుంది. పతకాలు సాధించిన క్రీడాకారులను ఎంపి రామ్మోహన్ నాయుడు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు విద్యార్థి దశలోనే తమ భవిష్యత్తుకు ప్రణాళికలు నిర్దేశించుకుని చదువు, క్రీడల్లోనూ ప్రతిభ కనబరచాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దువ్వ లక్ష్మీరమణమూర్తి, బాల్ బాడ్మింటన్ నాయకులు పి.వి.జి కృష్ణంరాజు, వ్యాయామోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.వి రమణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపి

కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - రణస్థలం

మండల కేంద్రంలోని గరికిపాలెంలో టైంకిట్ కిడ్స్ స్కూల్ మైదానంలో సంక్రాంతిని పురస్కరించుకొని నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలను టిడిపి సీనియర్ నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు గురువారం ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ మంచి ఉత్సాహంతో యువకులు రావడం చాలా సంతోషకరమని, ఈ సారి ఉత్తరాంధ్ర స్థాయి పోటీలు నిర్వహిస్తామని అన్నారు. ఈ సందర్భంగా ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు నగదు బహుమతితో పాటు మెమొంటో అందిస్తామని తెలిపారు.

కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న అప్పలనాయుడు

అరసవల్లిని సందర్శించిన జైళ్ల శాఖ డిఐజి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని జైళ్ల శాఖ డిఐజి ఎం.ఆర్ రవికిరణ్ గురువారం దర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతించారు. స్వామి వారి పలు సేవల్లో పాల్గొన్నారు. అనంతరం అనివెట్టి మండపంలో శేష వస్త్రాన్ని కప్పి జ్ఞాపికను అందజేశారు. ఆయన వెంట జైలర్ కె.ఉదయ్ భాస్కర్, డిప్యూటీ జైలర్ రామకృష్ణ, జిల్లా సబ్ జైలు అధికారి కె.మోహనరావు, ఆలయ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ సిబ్బంది

ఎయు దూర విద్య పరీక్షల్లో చూసిరాతలు

టెక్కలి: స్థానిక డిగ్రీ కళాశాలలో ఎయు స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డిగ్రీ ఫైనల్ ఇయర్ పరీక్షలు తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్నారు. గురువారం నిర్వహించిన ఎకనామిక్స్ పరీక్షకు జిల్లాలో వారంతా చూసిరాతకు పాల్పడటం చర్చనీయాంశమైంది. ఈ పరీక్షకు 67 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వారిలో అత్యధికులు స్లిప్పులు పెట్టడం, ఫోన్‌లో జవాబులు చూసి రాసినట్లు తెలిసింది. పరీక్ష ఇన్‌ఛార్జి కో-ఆర్డినేటర్ బాలకృష్ణ చూసి రాతలు, తనకు ఎటువంటి సంబంధం లేదని, కింది స్థాయి ఉద్యోగుల పొరపాటు వల్ల ఇటువంటి చర్చ జరుగుతోందని తెలిపారు. పక్కాగా నిర్వహించాల్సిన దూర విద్య పరీక్షలో మాల్‌ప్రాక్టిస్‌కు విద్యార్థులు పాల్పడటం చర్చనీయాంశమైంది.

కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి స్థలాలు

స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

అన్ని తరగతుల వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో శిష్టకరణ, గాయత్రీ బ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, క్రిస్టియన్, జై భీమ్ యువజన సంఘం కులాల ప్రతినిధులకు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం కోసం రెండున్నర సెంట్ల చొప్పున స్థలాలను కేటాయిస్తూ మంజూరు చేసిన పట్టాలను తన సతీమణి తమ్మినేని వాణిశ్రీతో కలిసి ఆయా కుల సంఘాల ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని కొనియాడారు. అన్ని కులాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు తోడ్పాటును అందిస్తున్నారని అన్నారు. కుల, మతం చూడకుండా అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, వైసిపి పట్టణ నాయకులు బొడ్డేపల్లి రమేష్‌కుమార్, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శిష్టకరణ సంఘం సభ్యులకు పట్టాను అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని

ఆదర్శప్రాయుడు ఎన్‌టిఆర్

శతజయంతి ఉత్సవాల్లో ఎంపి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సినీ నటుడిగా, ముఖ్యమంత్రిగా ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న కీర్తిశేషులు నందమూరి తారక రామారావు ఆదర్శప్రాయుడు అని పార్లమెంటు సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. నగరంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో నందమూరి అభిమాన సంఘాల ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో కలిసి ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎన్‌టిఆర్ అభిమానుల సంఘం జిల్లా అధ్యక్షులు బరాటం ఉదయ్‌శంకర్ గుప్త అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీని స్థాపించి తొమ్మిది నెలల కాలంలోనే అధికారాన్ని చేపట్టిన ఘనత ఎన్‌టిఆర్‌కే దక్కిందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఎన్‌టిఆర్ వారసులుగా ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేసి టిడిపిని అధికారంలోకి తీసుకురావడానికి శ్రమించాలన్నారు. అనంతరం పలువురిని సత్కరించారు. అనంతరం సంక్రాంతిని పురస్కరించుకుని దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యఓఉలు అధ్యక్షులు మాదారపు వెంకటేష్, జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షులు దుంగ శ్రీధర్, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

దుస్తులను పంపిణీ చేస్తున్న ఎంపి రామ్మోహన్ నాయుడు

పెండింగ్ జీతాలు చెల్లించకుంటే సమ్మె

ప్రజాశక్తి - పలాస

నీటి సరఫరా విభాగంలోని పంప్ ఆపరేటర్లు, వాల్స్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషన్, వాచ్‌మెన్‌లు 143 మందికి బకాయిపడిన 24 నెలల జీతం చెల్లించకుంటే ఈనెల 20 నుంచి సమ్మెలోకి వెళ్తామని ఉద్దానం వాటర్ ప్రాజెక్టు వర్కర్స్, లేబర్ కాంట్రాక్టు కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు వి.రామకృష్ణ తెలిపారు. గురువారం ఆర్‌డబ్ల్యుఎస్ టిఎస్ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ 1999 నుండి సుమారు 23 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. వజ్రపుకొత్తూరు, మందస, పలాస, నందిగాం మండలాలలో 143 గ్రామాలకు, కిడ్నీ ప్రభావిత ప్రాంతాల్లోని గ్రామీణ ప్రజలకు తాగునీరు అందించడంలో కీలక భూమిక పోషిస్తున్నారని చెప్పారు. కరోనా కారణంగా మార్కెట్లో ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, 24 నెలలు జీతాలు ఇవ్వకుంటే వారెలా బతుకుతారని ప్రశ్నించారు. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారని, వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కలెక్టర్‌కు స్పందనలో సమస్యను వివరించామని, ఎటువంటి ఫలితం లేదన్నారు. సమస్యను పరిష్కరించకుంటే సమ్మె తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉద్దానం వాటర్ ప్రాజెక్ట్ వర్కర్స్, లేబర్ కాంట్రాక్ట్ కో-ఆపరేటివ్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ ఎం.ఆనందరావు, కార్యదర్శి ఢిల్లీరావు, సభ్యులు ఎం.కృష్ణారావు, మాధవరావు, ఆనంద్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యుఎస్ అధికారికి సమస్యను వివరిస్తున్న కార్మికులు

ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలి

ప్రజాశక్తి - పలాస

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని మత్స్య, పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకల్లో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఇంటర్మీడియట్ తర్వాత డిగ్రీ సమయంలో ప్రతి విద్యార్థీ పోటీని తట్టుకొని నిలబడితే రాణించగలరని పేర్కొన్నారు. ప్రపంచ మార్కెట్లో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, వాటిని కనుక్కొని సాధించుకునేందుకు ప్రతి విద్యార్థీ ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకేసారి సచివాలయ వ్యవస్థ ద్వారా 1.50 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం చారిత్రాత్మకు నిర్ణయమని మంత్రి అన్నారు. వ్యవస్థల్లో అవినీతిని సమూలంగా నిర్మూలిస్తున్నారని, ఈ విషయాన్ని విద్యార్థులే క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని కోరారు. రాజకీయ లబ్ధి కోసం జాబ్ క్యాలెండర్ అంటూ మాట్లాడుతున్న ప్రతిపక్షాలు వారి పాలనా కాలంలో ఒకేసారి 1,50,000 ఉద్యోగాలు ఇవ్వడం ఎప్పుడైనా సాధ్యమైందా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మధు, పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాపికను అందిస్తున్న అప్పలరాజు

ఆంగ్లంలో ఆకట్టుకున్న విద్యార్థులు

కోటబొమ్మాళి: మండలం అక్కయ్యవలస ఎంపియుపిఎస్ పాఠశాల విద్యార్థులు గురువారం ఆంగ్లంలో మాట్లాడిన తీరు, నటన వంటి అంశాలు వమరవల్లి డైట్ ఉపాధ్యాయులను ఆకట్టుకుంది. ఇటీవల ఒమరివల్లి డైట్ ప్రిన్సిపాల్, డిప్యూటీ డిఇఒ డాక్టర్ తిరుమల చైతన్య అక్కయ్యవలస ఎంపియుపిఎస్ పాఠశాలను సందర్శించి అక్కడ పిల్లల ప్రగతిని గుర్తించారు. ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు అవలంబిస్తున్న బోధనా పద్ధతులను తెలుసుకునేందుకు వైవిఎ నాయుడు, జివి.రమణ, ఎస్‌పి అనితరాణితో కూడిన బృందం పాఠశాలను సందర్శించారు. వివిధ అంశాలను పరిశీలించారు. ఆంగ్లంలో పిల్లల సంభాషణలు, ఏక పాత్రాభినయాలు, స్కిట్స్, నాటికలు చూసి చాలా సంతృప్తిని వ్యక్తపరిచారు. పిల్లలను అభినందించారు. కార్యక్రమంలో సంజీవరావు, సునీల్, వైకుంఠరావు, సింహాచలం, రాములమ్మ టీచర్స్ పాల్గొన్నారు.

విద్యార్థులతో వమరవల్లి డైట్ ఉపాధ్యాయులు

పింఛను అందజేత

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ బెల్లుపడ కాలనీ-3 సచివాలయం పరిధిలోని 14వ వార్డు నీలకంటేశ్వర వీధిలో నివశిస్తున్న దుర్గాశి వెంకట పురుషోత్తం కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. విశాఖలో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి చొరవతో 14వ వార్డు కౌన్సిలర్ నీలాపు లక్ష్మి ఆదేశాలతో వాలంటీరు నీలపు నీలకంఠంరెడ్డి రూ.10వేలు డయాలసిస్ పింఛన్‌ను గురువారం అందజేశారు. ఆయన కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

కిడ్నీ రోగికి ఆర్థికసాయం

కొత్తూరు: మండలంలోని ఆర్.కె.పురం గ్రామానికి చెందిన పొట్నూరు రామారావుకు రెండు కిడ్నీలూ పాడయ్యాయి. విషయం తెలుసుకున్న భగత్‌సింగ్ ట్రస్టు సభ్యులు ఆయనకు రూ.15వేలు సహాయం చేశారు. పొలాకి మండలం జోగంపేట చెందిన కామేష్‌కు రెండు కిడ్నీలు పాడయ్యాయి. విశాఖలోని కిమ్స్ ఐ కాన్ ఆస్పత్రికి వెళ్లి ఆయనకు రూ.20వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో లోతుగెడ్డ శివ, చోడవరపు బాలకృష్ణ, నడిమింటి జగదీష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

బాధితురాలికి పరామర్శ

సోంపేట: మండలంలోని పలాసపురం గ్రామానికి చెందిన లావేటి సావిత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆమెను స్థానిక సర్పంచ్ తడక జోగారావు గురువారం పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన సావిత్రి తలకు తీవ్ర గాయం కావడంతో శ్రీకాకుళం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. సమాచారం తెలుసుకున్న సర్పంచ్ ఆమెను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు.

సంక్షిప్త వార్తలు

30 నుంచి కమ్మసిగడాం జాతర

ప్రజాశక్తి - రణస్థలం రూరల్

ఉత్తరాంధ్ర ఇలవేల్పు కమ్మ సిగడాం శ్రీ మహాలక్ష్మి తల్లి జాతర ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 1 వరకు మూడు రోజులు జరగనుందని ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని కమ్మ సిగడాంలోని శ్రీ మహాలక్ష్మితల్లి అమ్మవారి కళ్యాణ మండపంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతర సక్రమంగా నిర్వహించేందుకు జాతర మేనేజ్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసి ఎవరు ఏ పనులు చేయాలి, కల్చరల్ ప్రోగ్రాం, జాతర అభివృద్ధి, తదితర అంశాలును చర్చించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెలిచేటి రామకృష్ణ, వి.తేజ, వి.రాజశేఖర్, మన్నె లక్ష్మీప్రసాద్, వెలిచేటి పాల్గుణరావు, సురేష్‌కుమార్, మురళీధర్, రాయుడు, వి.జె.ఎస్.ఎల్.పి.మౌళి, గురాల జగన్నాథరావు, మన్నె కృష్ణానందం, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఈశ్వరరావు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొందూరు: మండలంలో విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా మండలం పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఇఇ భయ్యన్నాయుడు తెలిపారు. 11కెవి విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గోరింట, తుంగపేట, లైదాం, దళ్లవలస పిల్లలవలస, ధర్మపురం, పెనుబర్తి, మొదలవలస, బొడ్డేపల్లి గ్రామాలకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.

ఐరన్ మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి - పోలాకి

వీక్లీ ఐరన్ పోలిక్ యాసిడ్ సప్లిమెంటేషన్‌లో భాగంగా గురువారం డాక్టర్ నల్లి రవికుమార్ ఈదులవలస మోడల్ స్కూల్, కళాశాలను సందర్శించారు. భోజనం అనంతరం విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. మాత్రల పంపిణీ అనంతరం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను తనిఖీ చేస్తూ చిరు వ్యాధులు చికిత్స కార్యక్రమాన్ని చేపట్టారు. ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రల ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ, ఆరోగ్య సిబ్బంది ఆరాధన, వెంకటరావు, లక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని ఆభరణాల తనిఖీ

జలుమూరు: మండలంలోని శ్రీముఖలింగంలో వెలసి ఉన్న శ్రీముఖలింగేశ్వరస్వామి బంగారు, వెండి ఆభరణాలను గురువారం జువెలరీ వెరిఫికేషన్ అబ్జర్వర్ అధికారిని దుర్గభవాని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బంగారు, వెండి ఆభరణాలను తూకం వేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రభాకర్‌రావు తెలిపారు. ముఖలింగేశ్వరుని బంగారు, వెండి ఆభరణాలు అన్ని సక్రమంగా ఉన్నాయా లేదా అని వారు తనిఖీ చేసినట్లు ఆయన చెప్పారు. ఆభరణాల వారీగా తోకం వేసి వాటి బరువును రిజిస్టర్లో నమోదు చేశారని ఇఒ తెలిపారు. అర్చకులు పెద్ద లింగన్న, ప్రభాకర్‌రావు, దేవదాయశాఖ సిబ్బంది ఉన్నారు.

రిజిస్టర్‌లో నమోదు చేస్తున్న అధికారులు

భూ సమగ్ర సర్వే ప్రారంభం

కోటబొమ్మాళి: జగనన్న శాశ్వత భూహక్కు పథకం ద్వారా గ్రామాల్లో జరుగుతున్న భూసర్వేతో ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని హరిశ్చంద్రపురం సర్పంచ్ గురువెల్లి కేశవరావు, శ్రీజగన్నాథపురం సర్పంచ్ నూక సత్యరాజులు అన్నారు. గురువారం మండలంలోగల హరిశ్చంప్రురం, శ్రీగజన్నాథపురం పంచాయతీలో జగనన్న శాశ్వత భూహక్కు పథకాన్ని ఆయా గ్రామాల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వేయర్లు, డ్రోన్ కెమెరాల ద్వారా భూములను సర్వే నిర్వహించారు. ఎవరికైనా తమ భూమికి సబందించిన విషయంలో ఎలాంటి సమస్య ఉంటే సంబంధిత పత్రాలు తీసుకువస్తే వారికి న్యాయం చేయడం జరుగుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో హరిశ్చంద్రపురం ఎంపిటిసిలు బి.మాధవి దివాకర్, పూజారి సత్యం, శ్రీజగన్నాథపురం ఎంపిటిసి వాసు, మాజీ సర్పంచ్ ఎండ భాస్కరరావు, వార్డు మెంబర్లు, సచివాలయ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

సర్వేను ప్రారంభిస్తున్న సర్పంచ్ కేశవరావు

గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా పాలన

ప్రజాశక్తి - బూర్జ

గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా గ్రామ సచివాలయాలను స్థాపించి దానికి అనుబంధంగా వాలంటీర్ వ్యవస్థ ఏర్పాటుచేసి అవినీతి వివక్షకు తావు లేకుండా పాలనను అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని దేశమంతా కీర్తిస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండల కేంద్రంలో 87వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు పథకాలను వివరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకుంటూ అధికారులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లారు. కార్యక్రమంలో ఎంపిపి కర్ణేనా దీప, జెడ్‌పిటిసి బేజ్జి పురపు రామారావు, కండాపు గోవిందరావు, వైస్ ఎంపిపిలు, బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, బలరాంనాయుడు, గుమ్మడి రాంబాబు, అనురాధ, కృష్ణ, సురేష్, నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను అందిస్తున్న సాయిరాజ్

సోంపేట: మండలంలోని కర్తలిపాలెం పంచాయతీ గురువారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే సాయిరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రచారం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వర్‌రెడ్డి, ఎంపిపిలు ఎన్.దాసు, పైల దేవదాస్‌రెడ్డి, మడ్డు రాజారావు, పొందూరు గున్నయ్య, బుద్దాన శ్రీకృష్ణ, కె.శ్రీనివాస్, బాబురావు, ఎంపిడిఒ బి.వెంకటరమణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి పథకాలు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఫుడ్ ప్రొసెసింగ్ యూనిట్ రీసోర్స్‌పర్సన్ మోహన్‌కుమార్ అన్నారు. ప్రధానమంత్రి ఫుడ్ ప్రొసెసింగ్ మైక్రో ఎంటరప్రైజ్ పథకం కింద సీడ్ క్యాపిటల్ 40వేల రూపాయలు చొప్పున పొందిన స్వయం సహాయక సంఘ సభ్యులైన లబ్ధిదారులకు గురువారం స్థానిక వెలుగు, మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో పలాస, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, నందిగాం, టెక్కలి మండలాల నుండి 48 మంది లబ్ధిదారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు అప్పడాలు, జంతికలు, పచ్చళ్లు, ఒడియాలు ఇలా తినే ఆహార వస్తువులను తయారు చేస్తూ అమ్మకాలు చేస్తున్నారని, ఇందులో ఇంకా పెద్ద ఎత్తున ఆహార ఉత్పత్తులను తయారు చేసుకుని అమ్మకాలు చేసుకునే వారిని గుర్తించి, వారికి యంత్రాల ద్వారా తయారు చేసుకునే విధానం, తద్వారా రూ.లక్ష నుంయి రూ.10లక్షల వరకు రుణం పొంది యూనిట్లు స్థాపించుకునేందుకు ప్రోత్సాహం కల్పిస్తామని తెలిపారు. 30శాతం సబ్సిడీ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఏరియా కో-ఆర్డినేటర్ శిష్టు శ్రీరాములు, ఎపిఎం జి.నారాయణరావు, ఎఫ్‌పిజి ఎపిఎం రజనీ, అప్పలనరసమ్మ, మండల సమాఖ్య అధ్యక్షులు జయమ్మ, అకౌంటెంట్ జ్యోత్స్న, సిసిలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మోహన్‌కుమార్

మదన్ మోహన్‌కు అభినందనలు

జి.సిగడాం : ఎపి ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య చైర్మన్‌గా ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్‌మోహన్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఆయనను నాగులువలస హెచ్‌ఎం బొడ్డేపల్లి రమణమూర్తి, ఉపాధ్యాయ సిబ్బంది జెవిఎస్ఎస్.రాజు, రవికుమార్, సత్యంనాయుడు, నారాయణరావు, శ్రీనివాసరావు, శ్రీరాములు అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం

జి.సిగడాం : పాలఖండ్యం గ్రామంలో జి.సిగడాం పిహెచ్‌సి అధికారి డాక్టర్ యశ్వంత్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 65 మందికి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందించారు. పలువురిని మెరుగైన వైద్యంకోసం రిఫర్ చేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం డివిజన్ ఒఇ శివాజీ, 104 వైద్యాధికారి డాక్టర్ హరినాయుడు, ఎఎన్ఎం, ఆశ, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు

'యువశక్తి'ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - టెక్కలి

ఈ నెల 12న నిర్వహించే యువశక్తి బహిరంగసభను జయప్రదం చేయాలని జనసేన పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్ కోరారు. గురువారం యువశక్తి పోస్టర్‌ను టెక్కలి జనసేన కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం పలు కళాశాలల విద్యార్థులను కలిసి యువశక్తి కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జగన్ పాలనా వైఫల్యంతో యువత నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటోందన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమరనాథ్ నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఒక్క కార్యక్రమాన్ని కూడా చేయకపోవడం శోచనీయమన్నారు. పవన్ కళ్యాణ్‌ను తిట్టడానికే ఆయనకు మంత్రి పదవిని ముఖ్యమంత్రి ఇచ్చారని విమర్శించారు. రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిపోయి పక్క రాష్ట్రాలకు వెళ్లిపోయే పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో టెక్కలి జనసేన నాయకులు పెడడా త్రివేణి, గవరయ్య, కొత్తూరు హరి, రమేష్, కుమారస్వామి, మెట్ట నరేష్, వీర,గణేష్, శ్యామ్, సురేష్, యోగేష్, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మెళియాపుట్టి: జనసేన యువశక్తి ఆధ్వర్యంలో గురువారం గోడపత్రిక ఆవిష్కరణ నిర్వహించారు. ఈనెల 12న రణస్థలంలో జనసేన ఆధ్వర్యంలో చేపట్టనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని జనసేన మండల నాయకులు దుక్క బాలరాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పిట్ట హరికష్ణ, పాపారావు, మణికంఠ, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

అధికార మార్పు అనివార్యం

మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

ప్రజాస్వామ్యంలో అధికార మార్పిడి అనివార్యమని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అన్నారు. నగరంలోని అరసవల్లిలోని ఆయన నివాసంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారం కోసం అడ్డదారులు తొక్కి నియంతృత్వపు పోకడలను అమలు చేసినంత మాత్రాన అధికారం నిలుపుకోలేరన్నారు. గత చరిత్రలో ఎంతో మంది నియంతలు ఇటువంటి పోకడల వల్లే కాలగర్భంలో కలసి పోయారన్నారు. ప్రజలు మార్పు కోరినపుడు ఎంతటి వారైనా తలవంచాలే తప్ప ఒత్తిళ్లతో అధికారాన్ని నిలబెట్టుకోవడం ప్రజాస్వామ్యంలో సాధ్యం కాదన్నారు. ప్రజాస్వామ్యంలో పాలక, ప్రతిపక్షాలు రెండు కళ్లు అని అన్నారు. ప్రతిపక్షానికి ఊపిరైన సభలు, సమావేశాలు నిర్వహించకూడదని ఆంక్షలు పెట్టడం సరికాదన్నారు. సభలు, సమావేశాలను పోలీసులతో బలవంతపు ఆంక్షలు విధిస్తూ ప్రభుత్వం జిఒలు ఇవ్వడం అప్రజాస్వామికమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన చీకటి జిఒను ప్రజాస్వామ్యవాదులు ముక్తకంఠంతో ఖండించాలని కోరారు.

మాట్లాడుతున్న గుండ అప్పలసూర్యనారాయణ

చంద్రబాబుపై హత్యానేరం నమోదు చేయాలి

ప్రజాశక్తి - ఆమదాలవలస

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుపై హత్యానేరం కేసు నమోదు చేయాలని వైసిపి నాయకులు చింతాడ రవికుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తనపై, తన పార్టీపై జనాల్లో లేని ఆదరణను ఉన్నట్లు చూపించడానికి పేద ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకుని కందుకూరు, గుంటూరులో ఇరుకు సందుల్లో సభలు, సమావేశాలు నిర్వహించి పేద ప్రజల వరుస చావులకు కారణమయ్యారని విమర్శించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం జిఒ నంబరు 1ను తీసుకొచ్చిందని తెలిపారు. 11 మంది అమాయక ప్రజల చావుకు కారణమైన చంద్రబాబుపై ఎటువంటి వ్యాఖ్యలు చేయని ఆయన దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ జిఒ నంబరు 1పై మాట్లాడడం సిగ్గుమాలిన చర్య అని పేర్కొన్నారు. వారి తెర వెనుక సంబంధం మరోసారి రుజువైందని తెలిపారు. గుంటూరు ఘటనలో ఉయ్యూరు శ్రీనివాస్‌ను బలిపశువుని చేశారని, ఆ ఘటనకు చంద్రబాబే బాధ్యుడని పేర్కొన్నారు.

'ఉపాధి'ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగించుకోవాలని డ్వామా పీడీ జివి.చిట్టిరాజు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని సీతాపురం గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క కూలీకి రోజుకు రూ.250లు తగ్గకుండా చూడాలని ఎపిఒను అదేశించారు. కూలీలు కూడా రోజుకు ఆరు గంటల సేపు పని చేయాలని కోరారు. సీతల కోనేరు నీరు గ్రామానికి ఉపయోగపడేలాగా తీర్చిదిద్దాలన్నారు. ఈయనతో పాటు ఎపిడి మురళీకృష్ణ, బి.ప్రసాదరావు, ఫీల్డ్ అసిస్టెంట్ బెండి గిరి, కూలీలు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

గ్రామ స్థాయిలో స్వయంశక్తి సంఘాలు క్రమంతప్పకుండా సమావేశాలు నిర్వహించాలని వెలుగు ఎపిఎం ప్రసాదరావు అన్నారు. గురువారం తేలుకుంచి గ్రామ సంఘం స్థాయి స్వయంశక్తి సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా ప్రతి సంఘం సభ్యులు ఆర్థిక క్రమశిక్షణ, ఆదాయ కార్యక్రమాలు ఏర్పాటు, పుస్తక నిర్వహణ, రుణాలు పొందటం, సకాలంలో తిరిగి చెల్లించడం జరగాలన్నారు. ప్రతి సంఘం క్రమం తప్పక సమావేశాలు ఏర్పాటు చేసుకొని పారదర్శకతతో, సభ్యులందరూ భాగస్వామ్య పద్ధతిలో కార్యక్రమాలు చేసుకుని అన్ని సంఘాలు ఎ గ్రేడ్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలైన వైఎస్ఆర్ ఆసరా, చేయూత, 0 వడ్డీ, కళ్యాణమస్తుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సభ్యులు అందరూ సంఘం ఆడిట్ సిఆర్‌పిలతో చేయించుకోవాలని, ఆడిట్ ఫీజు సంఘ సభ్యులే చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో 52 సంఘాల లీడర్లు, సిసి మోహనరావు, విఒఎ కృష్ణవేణి, గ్రామ సంఘ అధ్యక్షులు పార్వతి పాల్గొన్నారు.

సత్యంనాయుడుపై చర్య తీసుకోవాలి

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

సాంఘిక సంక్షేమ శాఖ లో నకిలీ సర్టిఫికేట్‌తో ఉద్యోగంలో చేరిన సత్యం నాయుడుపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆర్టీఐ రక్షణ వేదిక అధ్యక్షులు ఎ.షణ్ముఖరావు డిమాండ్ చేశారు. నగరంలోని సిపిఐ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. బొడ్డపాడు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుని సంతకాన్ని ఫోర్జరీ చేసి స్కూల్ సర్టిఫికేట్ తయారు చేసుకుని ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన సత్యంనాయుడిపై శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అతనిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు యడ్ల గోపి, బలగ రామారావు, ఎఐటియుసి నాయకులు చిక్కాల గోవిందరావు, పంచిరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విజ్ఞాన యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సెంచూరియన్ విశ్వవిద్యాలయం విద్యార్థులు నిర్వహిస్తున్న వ్యవసాయ విజ్ఞానయాత్రకు బయలుదేరిన వాహనాన్ని నగరంలోని ప్రజాసదన్ వద్ద ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు జెండా ఊపి గురువారం ప్రారంభించారు. వ్యవసాయ విజ్ఞానంతో పాటు మెకానికల్ ఇంజినీరింగ్ ప్రాధాన్యం, ఉద్యోగ అవకాశాలు తెలుపుతూ యాత్ర సాగనుంది. కార్యక్రమంలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు.

సెలవులను సద్వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - లావేరు

సంక్రాంతి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. గురువారం లావేరు శాఖా గ్రంథాలయం ఆధ్వర్యాన స్థానిక పాఠశాలకు వెళ్లి గ్రంథాలయంలోని జాతీయ నాయకులు, బాల సాహిత్య పుస్తకాలను విద్యార్థులకు చూపించారు. పండగ సెలవుల్లో వీటిని చదవాలని కోరారు. ప్రతి విద్యార్థీ గ్రంథాలయంలో ధరావత్తు చెల్లించి పుస్తకాలను ఇళ్లకు తీసుకువెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ బి.నీలిమ, ప్రిన్సిపాల్ టి.బాలరాజు, గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పారదర్శకంగా అంచనాలు

కోటబొమ్మాళి: ఉపాధి హామీ కూలీలకు పనులకు సంబంధించి అంచనాలు పారదర్శకంగా ఉండాలని సీనియర్ క్వాలిటీకంట్రోల్ అధికారి వి.సతీష్‌బాబు అన్నారు. ఆయన గురువారం మండలంలోని గంగారం పంచాయతీ పెద్ద చింతలచెరువును పరిశీలించి, పలు సూచనలు చేశారు. పనులు అంచనాలు వేసేటప్పుడు కొన్ని ముఖ్యమైన ప్రమాణాలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట జూనియర్ క్వాలిటీకంట్రోల్ అధికారులు పి.సుధాకర్‌బాబు, వి.సందీప్, ఎపిఒ జి.హరిప్రసాద్, ఇసి టి.రాంబాబు, సిబ్బంది ఎన్.గోపాలకృష్ణ, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎలుగు దాడిలో గాయపడిన ఆవుకు చికిత్స

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

ఎలుగుబంటి దాడిలో గాయపడిన ఆవుకు వజ్రపుకొత్తూరు పశు వైద్యాధికారి మెట్ట పాపారావు గురువారం చికిత్స చేశారు. శారదాపురం గ్రామానికి చెందిన బమ్మిడి చంద్రశేఖర్‌కు చెందిన ఆవుపై బుధవారం రాత్రి గుర్తు తెలియని అడవి జంతువు దాడి చేసింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆవుకు రైతు వైద్యాధికారితో చికిత్స అందించారు. ఎలుగు దాడి వల్ల ఆవు గాయపడినట్లు పశు వైద్యాధికారి భావించడంతో అటవీశాఖ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సంఘటనతో ఉద్దానం ప్రాంతంలో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అటవీ అధికారులు

నూతన పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - కంచిలి

ఎన్నికల సందర్భంగా ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిదే అని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. కంచిలి ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణం వద్ద గురువారం నూతన పింఛన్లను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మండలానికి కొత్తగా 335 పింఛన్లు మంజూరయ్యాయని అన్నారు. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పింఛన్లు అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సీడాప్ చైర్మన్ ఎస్.శ్యాంప్రసాదరెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వరరెడ్డి, జెడ్‌పిటిసి ఇప్పిలి లోలాక్షి, ఎంపిపి దేవదాస్‌రెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షులు జి.రాందాస్, వైసిపి మండల అధ్యక్షులు వజ్జ మృత్యుంజయం, నాయకులు పి.జయరాం, లడ్డు కేశవపాత్రో, ఇప్పిలి కృష్ణారావు, గణప సింహాచలం, ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: స్థానిక ప్రజాపరిషత్ కార్యాలయంలో నూతన పింఛన్లను ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.2750 చొప్పున కొత్తగా 320 మందికి పింఛన్లు మంజూరయ్యాయని చెప్పారు. రాజకీయాలకు తావులేకుండా అర్హతే ప్రామాణికంగా వీటిని అందించినట్లు తెలిపారు. జగనన్న ప్రభుత్వంలో రాజకీయ బేధాలు లేకుండా అన్ని పథకాలూ అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టి.సీతారాం, దుర్గారావు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ధనుంజయ, తహశీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్, ఎంఇఒ త్రినాధరావు, మహంతి పెద్దరామునాయుడు, బూత్ కమిటీ కన్వీనరు చిల్ల వెంకటరెడ్డి, రాయపుడుపి బెజ్జి, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని 16వ వార్డులో నూతన పింఛన్లను మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతిదివ్య గురువారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ అర్హులకు సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సందిగాం: స్థానిక మండల కాంప్లెక్స్ ఆవరణలో నూతన పింఛన్లను కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ గురువారం పంపిణీ చేశారు. ఎంపిడిఒ హెచ్.వి.రమణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తిలక్ మాట్లాడారు. అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని, ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్ల పెంపు చేయడంతో పాటు పింఛన్లు పంపిణీలో దేశంలోనే ఆదర్శంగా నిలిచామని అన్నారు. అనంతరం సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు సువ్వారి వసంతకుమార్, రేగల లక్ష్మీకాంతం, పిఎసిఎస్ అధ్యక్షులు సర్దార బైరాగి, చిన్ని జోగారావు, జడ్డాడ జయరాం, విష్ణు, టి.ఫల్గుణరావు, తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు నూతన పింఛన్లను గురువారం మాసాహెబ్‌పేట పంచాయతీలో గురువారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రతా పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చింతాడ విజయకుమారి, గురువెల్లి మోహిని, గంగారావు శ్రీరాములు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తర్లిపేటలో నూతన పింఛన్లను చిన్నసాన ఎంపిటిసి సంబాళ రాజశేకర్ లబ్ధిదారులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వాడరేవు శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా పంపిణీ చేస్తున్న పెన్షన్లతో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని సచివాలయ కన్వీనర్ సనపల రాజు అన్నారు. గురువారం పురపాలక సంఘంలోని ఆరో వార్డు పరిధిలో ఉన్న కాళింగ మన్నయ్యపేటలో నూతనంగా మంజూరైన పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జలుమూరు: అర్హతే ప్రామాణికంగా వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద సామాజిక పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు ఎంపిపి వాని గోపి అన్నారు. గురువారం మర్రివలస సచివాలయం వద్ద నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.లక్ష్మణరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కవిటి: కొత్త పింఛన్లను నెలవంక సర్పంచ్ కుమార్ మోహన్‌రెడ్డి, ఎఎంసి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి చిన్నారెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణ, వైసిపి నాయకులు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

పలాస: అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు మంజూరు చేస్తున్నామని రెంటి కోట సర్పంచ్ శాసనసపూరి తిరుమలరావు అన్నారు. మండలంలోని రెంటి కోట గ్రామంలో గురువారం గ్రామ సభతో పాటు నూతనంగా మంజూరైన పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా పింఛన్లు మంజూరు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సద్గుణబాబు, వైసిపి గ్రామ పంచాయతీ అధ్యక్షులు మునియా కామన్న, సచివాలయ కన్వీనర్లు కాంతారావు, ధర్మారావు, శారదా, పంచాయతీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరమని ఆర్థిక అక్షరాస్యత సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ అన్నారు. ఎల్ఎన్‌పేట మండలం మల్లిఖార్జునపురంలో ఆర్‌బిఐలో భాగంగా యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్ఎన్‌టిటి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలానా బ్యాంకు నుండి మాట్లాడుతున్నామంటూ ఎవరైనా ఫోన్లు చేసి మన బ్యాంక్ అకౌంట్ వివరాలను అడిగితే సమాచారాన్ని ఇవ్వవద్దని సూచించారు. డబ్బు ఆశ చూపుతూ వచ్చే ఈ మెయిల్స్, ఎస్ఎంఎస్ కాల్స్ వల్ల మోసపోవద్దని అన్నారు. బ్యాంకు అకౌంట్ నెంబరు, మరే ఇతర సమాచారాన్ని ఎవరికీ ఈ-మెయిల్ లేదా ఫోన్ ద్వారా వెల్లడించవద్దని సూచించారు. ఎటువంటి మోసపూరిత ఆఫర్ల విషయాల్లోనూ మోసపోవద్దని తెలిపారు. ఎటిఎంలలో అపరిచితులకు డబ్బులు విత్‌డ్రా చేసి పెట్టమని ఎటిఎం కార్డు ఇవ్వకూడదని సూచించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన వార్షిక ప్రీమియం కేవలం రూ.20తో రూ.2లక్షలు ప్రమాద బీమా లభిస్తుందని చెప్పారు. 18 ఏళ్ల నుంచి 70ఏళ్ల వయస్సుగల వారికి ఇది వర్తిస్తుందని తెలిపారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు ఇన్సురెన్స్ పథకాలను వివరించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబర్కు, అలాగే ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మెన్ 14448 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మంజులత, సిఎఫ్ఎల్ సిబ్బంది రామారావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి - పలాస

స్థానిక ప్రగతి భవనంలో మందస మండలానికి చెందిన టిడిపి నాయకులు కార్యకర్తలు గురువారం రాత్రి వైసిపిలో చేరారు. వారిని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసిపిలో చేరిన వారిలో సారా దుర్వాసులు, మచ్చ కోదండ, సారా బలరాం, రాజాం శంకర్ చేరారు. కార్యక్రమంలో ఎంపిపి డొక్కరి దానయ్య, సర్పంచ్ బొడ్డ ఉదయ్‌కుమార్, వైస్ సర్పంచ్ సాలిన పాపారావు, మామిడి తులశయ్య, కూర్మారావు, చంటి, మధుసూదనరావు, వి.మాకయ్య జగన్నాయకులు, వెంకటరావు, సూర్యం, తదితరులు పాల్గొన్నారు.

పెరటి కోళ్లతో అదనపు ఆదాయం

ప్రజాశక్తి - జలుమూరు

మహిళలు ఇంటి వద్ద పెరటి కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం లభిస్తుందని ఎంపిపి వాన గోపి అన్నారు. గురువారం వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయం వద్ద డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం ద్వారా వచ్చిన 25 యూనిట్ల పెరటికోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అందులో భాగంగానే పెరటి కోళ్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జీవీ రవికుమార్, వెలుగు ఎపిఎం శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి ఉమామహేశ్వరరావు, మండల సలహాదారుడు పైడి విఠల్‌రావు, వైసిపి నాయకులు పిట్ట ప్రసాద్, పి.విజయ్‌కుమార్, వెలుగు కార్యాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న ఎంపిపి గోపి

మండల పరిషత్ బడ్జెట్ ఆమోదం

ప్రజాశక్తి - ఆమదాలవలస

మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల పరిషత్ అధ్యక్షులు తమ్మినేని శారద అధ్యక్షతన గురువారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన అంచనా బడ్జెట్‌ను సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సవరణ బడ్జెట్లో రూ.32,26,19,652లు రాబడి, రూ.32,25,20,246లు వ్యయంగా పేర్కొన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్లో రూ.34,70,64,271లు రాబడిగా, 34,69,62,715లు వ్యయంగా పేర్కొన్నారు. సభ్యులంతా ఏకగ్రీవంగా బడ్జెట్‌ను ఆమోదించారు. సమావేశంలో జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, ఎంపిడిఒ ఎం.రేణుక, వాసుదేవరావు, మానుకొండ ధనలక్ష్మి, ఎ.భాస్కరరావు, సుగుణ, జి.సూర్యం, టి.లక్ష్మి, పి.అనసూయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇంటింటికీ కుళాయి పనులు

ప్రజాశక్తి - పలాస

ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో ఇంటింటికీ శుద్ధ జలం అందించేందుకు రూ.700 కోట్లతో నిర్మిస్తున్న కుళాయి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఇ టిఎస్ ప్రసాద్ ఆదేశించారు. పలాస నియోజకవర్గంలో సుమ్మాదేవి, చిన్న సుమ్మాదేవి, మందస మండలం బాలిగాం, మకరజోల గ్రామాల్లో కుళాయి పనులను పరిశీలించారు. ఇంటింటికీ కుళాయి పనులను గురువారం పరిశీలించిన ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో వేగంపెంచాలని ఆదేశించారు. కిందిస్థాయిలో జరుగుతున్న పనుల్లో ఇబ్బందులను కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇఇ జాన్ బెన్‌హార్, డిఇ దుర్యోధన, ఎఇఇ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులను పరిశీలిస్తున్న ఎస్ఇ ప్రసాద్